క్లుప్తంగా

ఆర్థిక సాయం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన మానవత సంస్థలో ఇటీవల విద్యార్థి యూసుఫ్ పదవ తరగతిలో సాధించిన 556 మార్కుల పట్ల సంస్థ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం విద్యార్థి యూసుఫ్‌కు పై తరగతి చదువు ఇంటర్మీడియేట్ పుస్తకాలు కొనేందుకు రూ. 6000లను సంస్థ సాయం చేసింది. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి ,జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. సుబ్బారెడ్డి , రిటైర్డ్ ప్రిన్సిపల్ సుబ్బి రెడ్డి , సాయి విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ భూపతి రాయల్ పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ..

మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని 22వ రోజు కూడా కొనసాగించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ సాంబశివారెడ్డి, డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి ,డాక్టర్ ఆవటాల రామాంజుల రెడ్డి, రాటాల గోపి, రిలయన్స్ మాధవరెడ్డి, హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలవెన్స్ ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ఆశా కార్యకర్తలకు ఇవ్వవలసిన లెప్రసీ అలవెన్స్ మొత్తాన్ని తక్షణం ఇవ్వాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ, జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి శాంతమ్మలు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా లెప్రసీ సర్వే చేసిన ఆశా కార్యకర్తలకు సంవత్సరానికి రెండు సర్వేల ప్రకారం ఇవ్వవలసిన అలవెన్స్ మొత్తాన్ని ఇంతవరకు ఇవ్వకపోవడం చాలా దారుణమని అన్నారు. గత మాసంలో రెండు సంవత్సరాలకు లెప్రసీ అలవెన్స్ మొత్తం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఆశాలకు ఇమ్మని ప్రభుత్వం ఇచ్చినప్పటికీ ఆ మొత్తాన్ని ఆశా కార్యకర్తలకు ఇవ్వకుండా వెనక్కి పంపామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తెలియజేయడం ఆశా కార్యకర్తల పట్ల చాలా నిర్లక్ష్యంగా ఉన్నారనే దానికి నిదర్శనమని అన్నారు. తక్షణం లెప్రసీ అలవెన్స్ మొత్తాన్ని విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనకు శ్రీకారం చుడతామని తెలియజేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి సి. అమ్ములు నగర అధ్యక్షురాలు నరసమ్మ పాల్గొన్నారు.

ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు సాగించాలి



దుకాణదారులకు అవగాహన కల్పిస్తున్న తూనికల కొలతల శాఖ అధికారులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని ఆర్టీసీ బస్టాండులో దుకాణదారులు ఎమ్మార్పీ ధరలకే అమ్మకాలు సాగించాలని తూనికల కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రవీంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ మెట్రోలజీ వారోత్సవాల సందర్భంగా నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ లోని కూల్ డ్రింక్స్ , ఇతర యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ షాపులలోని తినుబండారాలు, కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ వాటిపై వున్న ధరలకే వినియోగదారులకు అమ్మాలన్నారు. లేకపోతే తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నీలం సంజీవరెడ్డి సేవలు మరువలేనివి

కడప ఎడ్యుకేషన్: ఒక సామాన్య రైతు కుటుంబంలో జన్మించి తొలి ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి నీలం సంజీవరెడ్డి ఎన్నో సేవలందించారని ఆయన సేవలు మరువలేనివని జెకె క్రీడా విద్యా సాంస్కృతిక అభివృద్ధి రాష్ట్ర అధ్యక్షులు లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం జెకె కార్యాలయంలో నీలం సంజీవరెడ్డి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సేవా సమితి అబ్దుల్ రాయల్ కరిముల్లా, అమీన్, ఎజాస్‌మున్నా పాల్గొన్నారు.

మొఘల్ చక్రవర్తుల చరిత్ర తొలగించడం తగదు

కడప సెవెన్‌రోడ్స్ : కేంద్ర ప్రభుత్వం మరోసారి తాజాగా సెంట్రల్ స్టడీస్ కు సంబంధించిన ఏడో తరగతి సోషల్ సబ్జెక్టులో మొఘల్ చక్రవర్తుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను పూర్తిగా తొలగించడం తగదని ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్ ధ్వజమెత్తారు. కడప కలెక్టరేట్‌లో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్, మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమాల్ బాషాతో కలిసి జిల్లా కలెక్టర్ కు దీనిపై వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం కేవలం ముస్లిం మైనార్టీల పట్ల మతవిద్వేషంతో ఎంతో ప్రాశస్త్యం కలిగిన మొఘలుల చరిత్ర, ఢిల్లీ సుల్తానుల చరిత్రను తొలగించడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం లోని ఎన్సీఈఆర్టీ ఇటీవల ఏడవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు కేంద్ర సిలబస్ లో సదరు చరిత్రను తీసివేసినట్లు ప్రకటించడం దారుణమన్నారు.

రాష్ట్రంలో దళితులే లక్ష్యంగా దాడులు

- కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో దళితులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సింగసాని వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జేమ్స్ అనే బీటెక్ విద్యార్థిపై అతనికి జూనియర్ అయిన అగ్రకుల విద్యార్థి కులం పేరుతో దూషించి దాడి చేయడం దారుణమన్నారు. అతన్ని ఒక గదిలో నిర్బంధించి చిత్రహింసలు పెట్టడం అనాగరికమన్నారు. తీవ్రగాయాలతో బాధిత విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు కేసు నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయో చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమన్నారు. మనం ఇంకా ఏ కాలంలో జీవిస్తున్నామో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. దళితులంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకే చాలా చిన్నచూపు ఉందని, వారి కార్యకర్తలు, నాయకులు కూడా అదేవిధంగా ప్రవర్తిస్తున్నారన్నారు. దళితులుగా పుట్టాల ని ఎవరైనా కోరుకుంటారా అని దళితుల పట్ల ఆయనకున్న వివక్షను ఏనాడో చెప్పారన్నారు. రాష్ట్రంలో దళితులు, మహిళలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ తిరుపతిలో జేమ్స్ అనే విద్యార్థికి జరిగిన అన్యాయం చూస్తుంటే ఫ్యాక్షన్ సంస్కృతిని గుర్తుకు తెస్తోందన్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సొంత నియోజకవర్గం పిఠాపురంలో దళితులను గ్రామ బహిష్కరణ చేశారని గుర్తు చేశారు. అనంతపురంలో దళిత మహిళను హత్య చేశారన్నారు. ఇన్ని జరుగుతున్నా చంద్రబాబుగానీ, పవన్ కళ్యాణ్‌గానీ కనీసం స్పందించిన పాపాన పోలేదన్నారు. హైదరాబాద్‌లో ప్రమాదం జరిగితే పరామర్శించడానికి వెళ్లిన పవన్ దళితులకు జరిగే అన్యాయాలపై ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. దారిన పోయే దానయ్య ఎవరో మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటిపై దాడి చేసి, దుర్భాషలాడితే పోలీసులు మాజీ ఎంపీపైనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం రాష్ట్రంలో అమలవుతున్న రెడ్‌బుక్ పాలనకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, త్యాగరాజు పాల్గొన్నారు.

దళితులకు రక్షణ కరువు

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.త్యాగరాజు అన్నారు. సోమవారం స్థానిక మాసాపేటలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం ఏ దిశగా వెళుతుందో తెలియని పరిస్థితి నెలకొందని, రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో దాడులకు తెగబడుతూ, కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారన్నారు. తిరుపతిలో దళిత విద్యార్థి జేమ్స్‌ను చిత్రహింసలకు గురిచేయడం బాధాకరమన్నారు. అగ్రకుల అహంకారంతో వారు పేట్రేగిపోతుంటే నియంత్రించాల్సిన పోలీస్‌యంత్రాంగం వారిపై కేసు నమోదు చేయడానికి కూడా వెనుకాడటం సిగ్గుచేటన్నారు.

వైవీయూకు రెగ్యులర్ వీసీని నియమించాలి

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన యూనివర్సిటీకి రెగ్యులర్ వైస్ ఛాన్స్‌లర్ లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే రెగ్యులర్ వీసీని నియమించాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ డిమాండ్ చేశారు. సోమవారం కడప నగరం ఓంశాంతి నగర్ లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైవీయూలో గత కొన్ని నెలలుగా రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేకపోవడంతో సమస్యలు రోజురోజుకీ పెరిగి పోతున్నాయన్నారు. విక్రమ్ సింహపురి యూనివర్సిటీకి సంబంధించిన రెగ్యులర్ వైస్ ఛాన్సలర్‌గా ఉన్న అల్లం శ్రీనివాసులును ప్రభుత్వం వైవీయూ ఇన్చార్జి వైస్ ఛాన్స్‌లర్ గా నియమించడం వల్ల కేవలం పది రోజులకు ఒకసారి మాత్రమే యూనివర్సిటీకి వచ్చి వెళ్లిపోతుంటారన్నారు. ఇంత పెద్ద యూనివర్సిటీకి రెగ్యులర్ వీసీ లేకపోవడం చాలా బాధాకరమన్నారు.

సామాన్య ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

కడప కోటిరెడ్డిసర్కిల్ : విశాఖపట్టణం కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ సామాన్య ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూ సేవలు అందిస్తోందని బ్రాంచ్ డైరెక్టర్ జేవీ సత్యనారాయణ మూర్తి తెలిపారు. సోమవారం కడప బ్రాంచ్ సర్వసభ్య సమావేశం కడప నగరంలోని శివప్రియ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బ్యాంకు సాధారణ ప్రజలకు, చిన్న వ్యాపారులకు, విద్య వైద్య అభివృద్ధి, వృత్తికారులకు రుణాలు అందించడమే కాకుండా ప్రజల పొదుపు పై ఇతర వాణిజ్య బ్యాంకులకన్నా అధిక వడ్డీని చెల్లిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తోందన్నారు. బ్యాంక్ అభివృద్ధికి, సేవల విస్తరణకు, సహకరిస్తున్న సభ్యులకు, ఖాతాదారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డైరెక్టర్ నారాయణ స్వామి, జోనల్ మేనేజర్ వెంకటేశ్, కడప బ్రాంచ్ మేనేజర్ తులసికుమార్ సభ్యులు పాల్గొన్నారు.

ఆకుకూరల పంటల సాగు లాభదాయకం



ఆకుకూరల పంటను పరిశీలిస్తున్న ఏడీఏ నాగరాజు

సిద్దవటం : గ్రామీణ ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న ఆకుకూరల పంటలు లాభాలు చేకూర్స్తాయని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని మాచుపల్లె రైతుసేవా కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. జనుము విత్తనాలకు రైతుల నమోదు ప్రక్రియను గమనించారు. అనంతరం మాట్లాడుతూ విత్తనాల కోసం నమోదు చేసుకొని డబ్బులు చెల్లించిన వారికి మంగళవారం నుంచి విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ రైతుల వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. నందలూరు లక్ష్మినారాయణ అనే కౌలు రైతు సాగుచేసిన ఆకుకూరల పొలాన్ని సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఆకుకూరల పంటలు లాభాదాయకమని, 365 రోజులు పంటల సాగుకు ఆకుకూరలతోనే సాధ్యమని ఆయన తెలిపారు.

మృతి చెందిన చిన్నారుల కుటుంబీకులకు ఆర్థిక సాయం

బ్రహ్మంగారిమఠం: ఈ నెల 12 మండలంలోని మల్లేపల్లె చెరువులో ఈతకు వెళ్లి ఐదుగురు బాలురు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి తల్లి దండ్రులకు గ్రీన్ హైవే పనులు చేస్తున్న దిలీప్ కంపెనీ యాజమాన్యం సోమవారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేతులమీదుగా పిల్లల తల్లిదండ్రులకు రూ.1లక్ష ప్రకారం చెక్కును అందిచారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న పిల్లలు చనిపోవడం చాలా బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. మల్లేపల్లె చెరువులో గ్రీన్‌హైవే వారు మట్టిని తీయడంతో అక్కడక్కడా పెద్ద గోతులు ఉన్నట్లు స్థానికులు తెలుపుతున్నారు. దాని ప్రభావంతో పిల్లలు చనిపోయారని స్థానికులు చెప్పారన్నారు. ఇందుకోసం కంపెనీ నిర్వాకులపై ఒత్తిడి తేవడంతో పిల్లల కుటుంబాలకు వారి వంతు సహాయంగా ఆర్థిక సాయం చేశారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, చిలమల నారాయణ యాదవ్, నాయకులు పోలిరెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకతకు వేదిక సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

కడప కల్చరల్ : కడప నగరంలో నిర్వహిస్తున్న జేవీవీ సమ్మర్ క్యాంపు జ్ఞానం, సృజన శీలతలకు ప్రధాన వేదిక కాగలదని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా తెలిపారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక ఆర్కే నగర్ లో ఉన్న ఉర్దూ పాఠశాలలో 'వేసవి వినోదం' పేరిట సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు సమీర్ బాష అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి లక్ష్మీరాజా విచ్చేసి మాట్లాడారు. వేసవి వినోదం పేరిట నిర్వహిస్తున్న ఈ శిబిరం బాలల మానసిక స్థితిని వికసింపజేసే సృజనాత్మక వేదికగా నిలుస్తోందన్నారు. ఇలాంటి వేదికలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేవీవీ నగర అధ్యక్షులు శివరావు మాట్లాడుతూ సమాజంలోని ప్రజల్లో విజ్ఞానాన్ని నింపాలన్న లక్ష్యంతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందని తెలిపారు. ఇలాంటి వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడంతోపాటు బాలల కళా ప్రతిభను, ఆలోచన సామర్థ్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంచగలవని ఐద్వా అధ్యక్షులు ఐఎన్ సుబ్బమ్మ అన్నారు. ఈ శిక్షణా శిబిరాన్ని జూన్ 5వ తేది వరకు కొనసాగిస్తామన్నారు. శిబిరంలో చిత్రలేఖనం, మ్యాజిక్, సైన్స్, ఓరిగామి, పాటలు, మట్టి బొమ్మల తయారీ రిసోర్స్ పర్సన్ల చేత అవగాహన కల్పించడం తదితరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకటేశ్వర్లు, పాఠశాల ఛైర్ పర్సన్ మహబూబ్ బాషా, ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గఫూర్ ,రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు రెడ్డి, రంగనాయకులు, కామేశ్వరమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్

కడప అగ్రికల్చర్: రైతులకు సాంకేతిక నైపుణ్యాలపై అవగాహన కల్పించాలని ఏరువాక కేంద్ర సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు కడప నగర సమీపంలోని తాడిగొట్ల గ్రామంలో గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా సోమవారం రైతు సదస్సు- వ్యవసాయ సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంకయ్య కుమార్ మాట్లాడుతూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు తమ మూడు నెలల క్షేత్రస్థాయి శిక్షణ తాడిగొట్ల గ్రామంలో రైతులతో కలిసి నిర్వహించారు. విదార్థి దశలోనే రైతులతో కలిసి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసి వారి అభివృద్ధికి చేయూత నివ్వాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర సమన్వయకర్త డాక్టర్ వీరయ్య మాట్లాడుతూ ప్రస్తుత రుతుపవనాలు మార్పుతో తొలకరి వర్షాలు పడటంతో సీజన్ ముందుగానే ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. రైతులు వేసవి దుక్కులు, పశువుల ఎరువులు నేలలో కలియదున్నడం వలన నేలసారం పెరుగుతుందన్నారు. కీటక విభాగ శాస్త్రవేత్త డాక్టర్ పాండురంగ మాట్లాడుతూ రైతులు పురుగులు, తెగుళ్లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడప మండల ఏఓ సురేష్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకుని అప్పుడు వ్యవసాయ అధికారులు సూచనల మేరకు మాత్రమే ఎరువులను వాడాలన్నారు. బద్వేల్ ఏడీ నాగరాజు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన ప్రతి రైతు తమ వివరాలను రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం వ్యవసాయ శాస్త్రవేత్తలు, విస్తరణాధికారులు, రైతులతో విద్యార్థులు తమ మూడు నెలల కార్యక్రమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం అభ్యుదయ రైతులను, అధికారులను విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాలమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణోత్సవం



సిద్దవటం : మండలంలోని మాధవరం పంచాయతీ పరిధిలోని ఎస్కేఆర్ నగర్‌లో వెలసిన శ్రీ భద్రావతి భావనారాయణస్వామి ఉత్సవ మూర్తులకు ఆదివారం రాత్రి వేద పండితులు వైభవోపేతంగా కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం చేయించి పట్టువస్త్రాలతో అలంకరించి వేదికపై కొలువు తీర్చారు. అనంతరం వేద పండితులు కల్యాణోత్సవంలో భాగంగా స్వామి వారికి ప్రత్యేక పూజలతోపాటు మాంగళ్యధారణ, తలంబ్రాలు వంటి కార్యాక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారి కళ్యాణం రంగరంగ వైభవంగా జరిపించారు. కొందరు భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ వారు అన్నప్రసాదాలను ఏర్పాటు చేశారు.

పల్లకిలో ఊరేగిన వీరభద్రుడు



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ వీరభద్రస్వామి పల్లకీలో ఊరేగారు.సోమవారం రాత్రి స్వామి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు రంగురంగు పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి పల్లకిలో ఉంచి ఊరేగించారు. ఈ పల్లకీలో సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

స్నపన తిరుమంజనం



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాత మార్కెట్‌లోని శ్రీ లలితాదేవి, రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆలయ 31వ వార్షికోత్సవం, శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున రతనాల వేంకటేశ్వరునికి, స్వామివారి చెల్లెలు లలితాదేవి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి విశేషంగా స్నపన తిరుమంజనం చేసి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం సామూహికంగా కుంకుమార్చన నిర్వహించి పసుపు, కుంకుమ దీపాలతో స్వామివారిని అర్చించారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



వీరపునాయునిపల్లె: మండలంలోని ఉరుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న నలసాలమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేద పండితులు ఉమా మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో సోమవారం వైభవంగా ముగిశాయి. ఈ ఆలయ నిర్మాణం గ్రామస్తుల ఆర్థిక సహకారాలతో నిర్మించారు. విగ్రహ ప్రతిష్ఠ ముగింపు కార్యక్రమాల్లో భాగంగా శివ పార్వతుల కల్యాణ మహోత్సవం నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, భైరవ ట్రాన్స్‌పోర్ట్ అధినేత మహేంద్రారెడ్డి, పుణ్యభూమి చారిటబుల్ ట్రస్ట్ అధినేత సాయినాథ శర్మ కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు.

అల్లాడుపల్లెలో శాశ్వత అన్నదానానికి రూ.1లక్ష వితరణ

చాపాడు: మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి సన్నిధిలో శాశ్వత అన్నదానం కోసం సోమవారం బత్తల చిన్న కుళ్లాయన్న అనే భక్తుడు రూ.1లక్ష అందజేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్రస్వామి సన్నిధిలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి సర్వజన అన్న సత్రంలో ప్రతి సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీని కోసం చాపాడుకు చెందిన బత్తల చిన్న కుళ్లాయన్న రూ.1లక్ష నగదును ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఛైర్మన్ పెరుగు వీరనారాయణ యాదవ్‌లకు అందజేసి రశీదు పొందారు. ఈ నగదును మైదుకూరు లోని ఏపీజీబీ బ్యాంకులో డిపాజిట్ చేసి దీని నుంచి వచ్చే ఆదాయాన్ని శాశ్వత అన్నదానం కోసం వినియోగిస్తామని ఈఓ చెప్పారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై అలుపెరగని పోరాటాలు



పుచ్చలపల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రజా వ్యతిరేక విధానాలపై పుచ్చలపల్లి సుందరయ్య అలుపెరగని పోరాటాలు చేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.మనోహర్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, సీపీఎం కడప నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, నారాయణరెడ్డి, ప్రజానాట్యమండలి నాయకులు నరసింహ, డీవైఎఫ్ఐ కడప నగర కమిటీ కార్యదర్శి విజయ్, సీఐటీయూ నాయకులు ఉదయ్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు రఘు, మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

కౌన్సిల్‌పై నింద వేసి జీతాలు ఇవ్వకపోవడం సరికాదు



అడిషనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ కౌన్సిల్ ఆమోదం లేకపోవడం వల్లే మున్సిపల్ కార్మికులకు జీతాలు ఆలస్యం అవుతున్నాయని అధికారులు చెప్పడం సరికాదని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు అన్నారు. సోమవారం వారు అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రకు వినతి పత్రం సమర్పించారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటో తేది నుంచి బడ్జెట్ ఆమోదం లేకపోయినా కోట్ల రూపాయల పనులకు టెండర్లు పిలుస్తున్న నగరపాలక అధికారులు... మున్సిపల్ కార్మికుల జీతాల దగ్గరకు వచ్చేసరికి బడ్జెట్ ఆమోదించలేదని కౌన్సిల్‌పై నెపం వేస్తున్నారన్నారు. అభివృద్ధి పనులకు ఎలాగైతే బడ్జెట్ ఆమోదం లేకుండా టెండర్లు పిలుస్తున్నారో...కార్మికుల జీతాలు కూడా పెండింగ్ లేకుండా ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె . బాబు, డివిజన్ ఇన్‌చార్జులు బసవరాజు, ఐస్‌క్రీం రవి, కిరణ్, ఎస్. ప్రసాద్‌రెడ్డి, రెడ్డిప్రసాద్, సీహెచ్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్‌లో వైద్యులకు ప్రత్యేక అవగాహన సదస్సు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వైద్య బృందం

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో వైద్యులకు, అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ వైద్యులకు వేలూరు సీఎంసీ వారి ఆధ్వర్యంలో ట్రైనింగ్ ప్రోగ్రాం బేసిక్ కోసం మెడికల్ ఎడ్యుకేషన్ మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ఉదయం 9 గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీ జమున సూచనల మేరకు ఇంచార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నరసమ్మ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, డాక్టర్ సునీల్, డాక్టర్ పి సోఫియ, కోఆర్డినేటర్ మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ , ఎన్ఎంసీ నియమించిన అబ్జర్వర్ అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ వేలూరు సీఎంసీ ట్రామ సర్జరీ డాక్టర్ సృజన్ శర్మలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు హాజరు కాని వారిపై చర్యలు వద్దు



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2024 సాధారణ ఎన్నికల్లో వివిధ అనారోగ్య కారణాలతో విధులకు హాజరు కాలేక పోయిన ఉపాధ్యాయులకు ప్రస్తుతం జరుగుతున్న పదోన్నతి, బదిలీల్లో వారికి అవకాశం కల్పించాలని ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ ఇలియాస్ బాష, సెక్రెటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా కోరారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి ఫ్యాప్టో తరుపున వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతవరకు గతంలో జరిగిన సాధారణ ఎన్నికలకు కొంతమంది ఉపాధ్యాయులు వ్యక్తిగత, అనారోగ్య కారణాలతోనూ విధులకు హాజరు కాలేని పక్షంలో రిజర్వులో ఉన్న సిబ్బందితో విధులు నిర్వహించేవారన్నారు. అంతేకాని ఇలా ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ వారిపై బనాయించి అవి పెండింగ్‌లో ఉన్నాయని తెలుపుతూ జరుగనున్న పదోన్నతి, బదిలీల్లో అవకాశం లేకుండా చేయడం న్యాయ సమ్మతం కాదన్నారు. వారిపై మానవతా దృక్పథంతో అనారోగ్యంగా, వ్యక్తిగత కారణాలతో ఎన్నికల విధులకు హాజరు కాని ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు ఖాదర్ బాషా, నరసింహారావు, మహబూబ్ బాషా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు